# ఎన్నికలలో ఎన్ని కలలో...




పాలకూర సీతాలత

బస్‌స్టాండ్ దగ్గర బస్సుకోసం ఎదురు చూస్తున్న పాణిగ్రాహి తృప్తిగా

తల పంకించేడు. ఏ బస్సులోనూ కూడా ఓవర్‌లోడింగ్ లేదు. ఫుట్‌బోర్డుపైన

వేళ్ళాడుతూ నిల్చోవడం, ఒంటికాలిమీద కూడా నిలబడడానికి వీలులేనంతగా జనాల్ని అందులో కూరెయ్యడంవంటివి లేవు. ఆఫీసుటైముకి వెళ్ళే బస్సులే అయినా చాలా సాధారణంగా అరడజనుకు మించని స్టాండింగు పాసింజర్లతో బసులు నడుస్తున్నాయి. బస్ స్టాండు దగ్గర వెయిటింగ్ అనేది లేదు ప్రతి నిముషానికీ ఒక బస్సు వస్తోంది— శభాష్... ఎన్నికలలో . గెలిచేకా ప్రభుత్వం అన్నమాటను నిలబెట్టుకుంది. వీలైనన్ని బస్సులు పెంచి ప్రయాణికులకు సౌకర్యం కల్గించింది.

తన రూటు బస్సులో ఎక్కాడు. కండక్టర్‌కు తన స్టేజి చెప్పాడు, పాతిక పైసలు ఇస్తూ.

అతను ఇరవై పైసలు తిరిగి ఇచ్చాడు. పొరపాటుపడ్డాడేమో అనుకుని అడగబోతుంటే చించి చేతిలో టిక్కెట్టు పెట్టాడు కండక్టర్. అది ఐదు పైసల టిక్కెట్టు. పాణిగ్రాహి ముఖంలో ఆశ్చర్యం గమనించి కాబోలు అన్నాడు అతను-

"మినిమమ్ ఫేర్ అయిదు పైసలే సార్? టిక్కెట్ల ధరలు తగ్గాయి..."

సంతోషించాడు. స్టేజి రాగానే దిగిపోయాడు.

రైలు రావడానికి ఇంకా టైముంది. ఉదయం టిఫిన్ తినలేదుకనుక హోటల్లో ఆ పని చెయ్యాలని నిశ్చయంతో ఎదురుగా కన్పించిన హోటల్లోకి వెళ్ళాడు. అక్కడ రేట్ల బోర్డు కొత్తది తయారవుతోంది. ఎందుకని అడిగాడు.

"ధరలు తగ్గాయి కదా సార్! అవి ఇంక పెరగవు కూడా. అందుకే రేట్లు కూడా పెయింట్‌తో రాయిస్తున్నాం..." అన్నాడు ప్రొప్రయిటర్.

రేట్లు చూచాడు.

రెండు ఇడ్లీ - 10 పైసలు

దోశ - 25 పైసలు

స్వీటు - 30 పైసలు

కాఫీ - 15 పైసలు

టీ - 10 పైసలు

ఆహా! ఎన్నికలలో చేసిన వాగ్దానాలు తు.చ. తప్పకుండా ఆచరిస్తోంది ప్రభుత్వం. సామాన్యుడికి ఇంతకంటే ఏం కావాలి? తను ఇండియాలో లేని ఏడాదిలో ఎన్ని మార్పులు! కడుపునిండా టిఫిన్ తిన్నాడు. బిల్లుచూస్తే రూపాయికి లోపు. బిల్లిచ్చి బైటపడ్డాడు. భార్యను రిసీవు చేసుకుందుకు స్టేషన్లో అడుగు పెట్టాడు. రైలు అయిదు నిమిషాలు లేటట. గతంలో అయితే అయిదు నిమిషాల లేటు లేటుకాదు. ఇప్పుడు చాలా ఖచ్చితంగా వుంటున్నారట. బోర్డు చూశాడు.

మద్రాసు మెయిల్ - 2 నిముషాలు లేటు.

హైదరాబాదు ఎక్స్‌ప్రెస్ - 3 నిమిషాలు లేటు.

ఈ లేటువల్ల కలిగిన అసౌకర్యానికి మేము చింతిస్తున్నాము. ప్రయాణీకుల నుంచి మన్నింపు కోరుతున్నాము..." అని రాసి వుంది.

'ఆహా! ఎంత పొలైట్‌గా ప్రవర్తిస్తున్నారు వీళ్ళు...' ఆనందంతో తల మునకలైనాడు. ఇంతలో రైలువచ్చింది. స్టేషన్లో ఎనౌన్సుమెంటు వినవచ్చింది.

"ఈ రైలు అయిదు నిముషాల లేటుగా వచ్చింది, ఎక్స్‌ప్రెస్ అయినా. కనుక దీన్ని మేము పాసింజర్‌గా భావించి, ప్రయాణీకులకు కల్గిన అసౌకర్యానికి చింతిస్తూ ఈ ప్రయాణీకులకు కేవలం పాసింజర్ రైలుయొక్క ఛార్జీలు తీసుకుంటాము. వారు ఎక్స్‌ప్రెస్ రైలుగా కొన్న టిక్కట్టుమీద పాసింజరు రైలు ఛార్జీ మినహాయించి మిగతా డబ్బులు తిరిగి అందచేస్తాము. రైలు దిగిన ప్రయాణీకులు 6వ నెంబరు కౌంటరువద్ద డబ్బులు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం..."

పాణిగ్రాహి 'ఆహా..' అనుకున్నాడు. రైలు దిగిన అతని భార్య శాంభవి 'ఓహో' అనుకుంది. డబ్బులు తీసుకుని బైటపడ్డారు.

ఆటోను పిలిచేడు, బేరం ఆడబోయాడు.

"బేరం ఏముంది? మీటర్ రేట్... అంతే. లగేజీకి ఎక్స్‌ట్రా ఏం లేదు... కొత్తరూలు కదా సార్..." అన్నాడు వాడు.

ఆటో ఎక్కారు. ఎవరూ అడక్కపోయినా ఆటోవాడే అన్నాడు-

"లగేజికి విడిగా డబ్బులు తీసుకోవడమేమిటి సార్?... ప్రయాణం చేసే వాళ్ళు చేతుల్లో సామాను లేకుండా చెయ్యరు కదా... లగేజికి డబ్బులడగటం ఘోరం కదు!... మాకు మాత్రం ఎందుకుసార్ ఈ సంపాదన? పెట్రోలు ధర పడిపోయింది కదా!" మునిమునిగా నవ్వేడు పాణిగ్రాహి.

"ఆఫీసుకు శలవుపెట్టేరా?" అంది శాంభవి.


"అవును. మధ్యాహ్నం కొంచెం లోను విషయం చూడ్డానికి ఆ వేరే ఆఫీసుకి వెళ్ళాలి..." అన్నాడు.

ఇల్లు చేరారు.

భోజనంచేసి మధ్యాహ్నం ఆ లోను విషయం చూడాలని వేరే ఆఫీసుకి వెళ్లాడు. అక్కడ ప్యూన్ కన్పించి-

"ఓ మీరు నిన్న అప్లికేషన్ పెట్టారు కదూ!... మీ లోను శాంక్షన్ అయింది. కాగితాలు రెడీ అయ్యాయి. కేష్ సెక్షన్‌కు వెళ్ళి మీ పేరు చెప్పండి. డబ్బులు తీసుకోండి..." అన్నాడు.

ఆశ్చర్యపోయాడు. "ఏమిటి? ఇంత త్వరగా అయిందా పని?... చేతులు తడిపినా కూడా వారం రోజుల్లో కావడం అసాధ్యం అయ్యేది.... ఇపుడు ఒక్క రోజులో..." తనలో తాను అనుకోబోయి పైకి అనేశాడు.




నవ్వేడు ప్యూన్.

"రోజులు మారేయి సార్...ఇపుడు కాగితాలు 'పెండింగు'లో వుంచడం లేదు. క్విక్... పనిలో శ్రద్ధ పెరిగింది. ప్రజా సేవ చెయ్యాలని ఆసక్తి హెచ్చింది. అర్జంటు, ఆర్డినరీ అంటూ రకాలు లేవు. ఉన్నదల్లా ఒకటే రకం...అర్జంటు... వెళ్ళి డబ్బులు తీసుకోండి..." అన్నాడు.

సంతోషంతో అయిదు రూపాయలు తీసి ప్యూన్‌కి ఇవ్వబోయాడు.

వాడు వెంటనే కళ్ళు మూసుకున్నాడు.

"వద్దుసార్... ఆ రోజులు కావు ఇవి... ఆ కాగితం...అదే ఆ అయిదు కాగితం ఇంకా నయం మీరు నా చేతిలో పెట్టలేదు... చెయ్యి కాలిపోయేది... వద్దు... ఆ డబ్బు జేబులో పెట్టుకోండి... అపుడే కళ్ళు తెరుస్తాను నేను..." అన్నాడు.

పాణిగ్రాహి డబ్బు లోపల పెట్టుకున్నాడు.

"ఎందుకు సార్! ఈ అక్రమ సంపాదన? ధరలన్నీ పడిపోయాయి. వచ్చిన జీతం మిగిలిపోతోంది. ఇంకా ఎందుకీ సంపాదన? వెళ్ళండి.." అన్నాడు వాడు.

పాణిగ్రాహి వెళ్ళి డబ్బులు తీసుకున్నాడు. తిరిగి ఇంటికి వస్తుంటే రోడ్డు జంక్షన్ దగ్గర-

ఒకరు నిలబడి వున్నాడు. వాడి చేతిలో వంద నోటు వుంది.

"అయ్యో! ఎవరో ఈ వందనోటు పారేసుకున్నారు. ఇక్కడే రోడ్డుపక్కన దొరికింది. ఎవరిదో వచ్చి తీసుకో

వచ్చు..." అంటున్నాడు. ప్రతినిమిషం అదేమాట అంటున్నాడు.

చాలామంది వచ్చి విషయం తెల్సుకుని 'తమది కాదని' చెప్పి వెళ్ళిపోతున్నారు.

ఆహా!... ఎంతటి సత్యసంధత... ఎంత నీతి...!

తనకు దొరికిందంటూ అతడు చెప్పడం ఒక వింత.

అది విని 'తమదే అది' అంటూ ఎవరో ఒకరు బుకాయించకపోవడం రెండో వింత.

పాణిగ్రాహి అనుకున్నాడు.

'ప్రజలు నీతిమంతు లయిపోయారు. ధరలు తగ్గి, డబ్బులు మిగిలిపోతూ వుండటం ఇందుకు కారణం. అందుకే పరులసొమ్మును గడ్డిపోచగా భావిస్తున్నారు. కడుపు నిండినవాడికి అన్నం పెడతాను రమ్మంటే బాధుకదా!'

ఆ వందనోటుతో వున్న వ్యక్తి ఎవరితోనో అంటున్నాడు-

"ఉదయం దొరికింది ఇది. అప్పట్నుంచీ ప్రాణాలు అలుపు వచ్చేలా అరుస్తున్నాను. నా ఖర్మకొద్దీ ఆ సొంతదారు ఎవరో ఇంతవరకూ తెలియదు. సాయంత్రందాకా చూసి, ఎవ్వరూ రాకపోతే ఈ సొమ్ము ప్రభుత్వానికి జమ కడతాను."

అక్కడ్నుంచి కదిలాడు పాణిగ్రాహి. ఇల్లు చేరాడు.

సాయంత్రం పాణిగ్రాహి కొడుకు, ఇరవైరెండేళ్ళ వాడు, కిషోర్ కాలేజీ నుంచి వస్తూనే అన్నాడు-

"నాన్నా! ఈ లెటర్ చూడండి..." అంటూ ఒక కాగితం చేతిలో పెట్టాడు.

అది అప్పాయింట్‌మెంట్ లెటర్. పరీక్షలు కావడానికీ, డిగ్రీ దొరకడానికీ ఇంకా మూడునెలల పైముంది. పరీక్షలు కాగానే వచ్చి ఉద్యోగంలో చేరమని వుంది. అందులో ఇంకా వుంది—

"విపరీతంగా పరిశ్రమలు పెరగడం, వైజ్ఞానికంగా కూడా ఎంతో మార్పు కలగడం వల్ల అనేక ఉద్యోగాలు పుట్టుకురావడంతో దేశంలో క్వాలిఫికేషనున్న వాళ్ళందరికీ ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ఉద్యోగాలు చెయ్యడానికి మనుషులే కరువై సంతగా అవకాశాలు పుట్టుకురావడంతో మీక్కూడా ఈ ఆఫర్ చెయ్యబడింది. పై చదువులు చదవాలని కోరికవున్నా, దేశావసరాలు దృష్టిలోవుంచుకుని, దేశంమీద అభిమానంతో, దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళడం మీ బాధ్యతగా గుర్తించి వెంటనే ఉద్యోగంలో చేరమని కోరుతున్నాం."

అది చదివి పాణిగ్రాహి కొడుకుతో అన్నాడు-

"తప్పదు! దేశంకోసం నువ్వు ఈ ఉద్యోగంలో చేరాలి..." అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్లు.

"సరే నాన్నా! తప్పుతుందా మరి!"

అన్నాడు కిషోర్.

కాసేపయ్యాక పాణిగ్రాహి తమ్ముడు 'త్రినేత్రరావు' వచ్చేడు. అతను పోలీస్ ఆఫీసర్.

వదిన ఇచ్చిన కాఫీ తాగుతూ పిచ్చాపాటీ మొదలుపెట్టాడు.

"అవునూ, అమ్మాయి ఇంకా కాలేజీ నుంచి రాలేదేం?" అడిగాడు భార్యను పాణిగ్రాహి.

"స్కూల్లో ఏదో ఫంక్షన్ వుందట. ఆలస్యంగా వస్తానంది. తొమ్మిది అయిపోతుంది ఈ రాత్రి అది వచ్చేసరికి..." అంది శాంభవి.

అదిరిపడ్డాడు పాణిగ్రాహి.

"నువ్వు ఎలా ఒప్పుకున్నావు. ఆడపిల్ల, అందులోనూ వయసులో ఉన్నది. రాత్రి ఒక్కర్తీ రాగలదా?" చిర్రుబుర్రులాడేడు.

త్రినేత్రరావు కల్పించుకున్నాడు—

"ఏమవుతుంది? ఏం ఫర్వాలేదు... కంగారుపడకు..."

"అదికాదురా!, రౌడీ వెధవలు..."

ఫక్కున నవ్వాడు త్రినేత్రరావు.

ఎందుకిలా ఘోరంగా నవ్వుతున్నాడో అని ఆలోచించాడు పాణిగ్రాహి.

నవ్వు ఆపి చెప్పాడు త్రినేత్రరావు.

"నీకు ఈ విషయం తెలియదన్నమాట. ఈ రోజుల్లో అర్ధరాత్రి వేళ అయినా ఒంటరిగా ఒక ఆడపిల్ల ఇల్లు చేరగలదు, ఏ భయమూ లేకుండా. రౌడీయిజం పూర్తిగా చచ్చింది. మోసాలు లేవు, దొంగతనాలు లేవు, బలాత్కారాలు లేవు. ఆడపిల్లల్ని ఏడిపించాలని ఎవ్వరూ అనుకోవటం లేదు. 'All Indians are my brothers and sisters' అన్న భావం ప్రజల్లో నాటుకుపోయింది. బస్ స్టాండుల దగ్గర, సినిమాహాళ్ళ దగ్గర, రోడ్డుపక్కనా ఈలవేసి గోలచేసే నేరో కట్ ఫాంటులు, హిప్పీజుట్టులు ఇప్పుడు అంజనం వేసి వెతికినా కన్పించటం లేదు."

"ఇంత మార్పు ఒక్కసారిగా ఎలా వచ్చింది? ప్రజలు అంత బుద్ధిమంతులు ఎలా అయ్యారు" అమాయకంగా ప్రశ్నించేడు పాణిగ్రాహి.

"ఏముంది? 'దండం దశగుణం భవేత్' అంతే.. ప్రభుత్వం చాలా కఠినమైన శిక్షలు అమలుజరుపుతోంది. వాడు ఎలాంటివాడైనా, ఎంత పెద్ద అధికారికి దగ్గర చుట్టమయినా అవన్నీ గమనించక చాలా ఖచ్చితంగా శిక్షలువేసింది. ఆ శిక్ష అనుభవించినవాళ్ళను చూసి మిగతా వాళ్ళు భయపడిపోయి బుద్ధిగా మారియారు. దొంగతనం నేరం ఋజువయితే చేతులు నరికేస్తోంది. ఆ శిక్ష అనుభవించినవాడి మొండిచేతులు చూసి మరొకడు అలా తయారవడానికి సిద్ధం కావడంలేదు. ఆడపిల్లను చూసి కన్ను కొడితే, వాడి కళ్ళు పొడిచేస్తున్నారు. గుడ్డివాడు కావాలని ఎవ్వరూ కోరుకోరు.

అందుకే ఆ కన్ను కొట్టడాలు ఆగి పోయాయి. ఆడపిల్లను చూసి పిచ్చి వాగుడు వాగి ఈలలు వేస్తుంటే ఆ నోరు సూదితో కుట్టేస్తారు, మత్తుమందు ఇవ్వకుండానే. అందుకని ఆ వెధవపన్లు లేవు. ఇలా రెండునెలలు గడిచాయి."

"తర్వాత?"

"తర్వాత ఏముంది!" ఆ శిక్ష అమలు చెయ్యడానికి మనుషులు దొరకటంలేదు. అంటే, ఆ తప్పులు ఎవ్వరూ చెయ్యటం లేదన్నమాట."

"చాలా బాగుంది, చాలా మంచి మార్పు."

"మొన్న ఏమయిందో తెలుసా?"

"ఏమైంది?"

"మా అమ్మాయికి కాలేజీలో ఏదో ఎక్స్ట్రా క్లాసు వుండటంవల్ల ఆలస్యం అయింది. ఒక్కత్తీ గబగబా నడుచుకుంటూ వస్తోందిట. ఇంతలో ఇద్దరు కుర్రాళ్ళు ఆమె దగ్గరకు వచ్చి..."

"ఆ... వచ్చి?... ఏం చేసారు?" ఆత్రంగా అన్నాడు పాణిగ్రాహి.

శాంతంగా నవ్వేడు త్రినేత్రరావు.

"ఎందుకన్నయ్యా అంత కంగారు నీకు?"

"లేదులే... చెప్పు..."

"అమ్మా! ఈ చీకట్లో ఎక్కడకు వెళ్తున్నావు? పెద్దగా భయంలేకపోయినా నీవు ఇల్లు చేరితే మా మనసుకు శాంతి తల్లీ! పద... నిన్ను మీ ఇంటిదాకా దిగబెడతాం..." అన్నారట. అవసరం లేదని అంది. ఎంత నచ్చచెప్పినా వినలేదట. అతి కష్టంమీద వాళ్ళను ఒప్పించింది. ఒక్కర్తే ఇల్లు చేరింది..." అన్నాడు త్రినేత్రరావు.

"గుడ్... అయితే ఇప్పుడు నేను నా కూతురు గురించి భయపడక్కర్లేదు అంటావ్. అంతేగా?"

"అవును... ముమ్మాటికీ..."

"నాకు చాలా ఆనందంగా వుందిరా!"

"అసలు మాకు పనిలేకుండా పోయింది. దొంగతనాలు, దోపిడీలు లేవు. అన్యాయాలు, మోసాలు లేవు. అవినీతి, కల్తీ, వ్యభిచారం అనేవికూడా నాశనం అయ్యాయి. మాకు బోలెడు తీరిక ఇప్పుడు. నిజానికి ఈ పోలీసు డిపార్టుమెంటు అవసరం లేదురా ఇంక..." అన్నాడు త్రినేత్రరావు.

"ఇంకానయం, డిపార్టుమెంటు అవసరం లేదు కదా అని మిమ్మల్నందర్నీ ఇళ్ళకు పొమ్మని అనలేదు- డిపార్టుమెంటు ఎత్తేసి..." అన్నాడు నవ్వుతూ పాణిగ్రాహి.

"అలా నవ్వకు మరి... అదీ అనుకున్నారు. తర్వాత మళ్ళీ ఆలోచించారు. నిరుద్యోగ సమస్య వస్తుందేమో... పోనీలే... వుండనీ... అని ఊరుకున్నారుట..."

"పోనీలే... మంచిపని చేశారు..."

"ఇంకో విషయం విన్నావా? దొంగ

తనం చెస్తే చేతులు నరికీ, అసభ్యంగా మాట్లాడితే నోరు కుట్టీ- ఇలాంటి శిక్షలు వేశారు కదా! ఒక 'రేప్' జరిగింది చాలా రోజుల క్రితం, అతనికీ వేశారు శిక్ష. ఊహించుకో ఏం శిక్షో... నన్ను చెప్ప మనకు..." అన్నాడు త్రినేత్రరావు.

"ఆఁ...నిజంగా?..." అదిరిపడ్డాడు పాణిగ్రాహి.

"అవును...కత్తితో..."

"పోన్లే. ఇంక అలాంటి వెధవపన్లు చెయ్యరు..."

అప్పుడే అడుగుపెట్టింది కాలేజీనుంచి వస్తున్న తటిల్లత.

"నేను వద్దన్నా వినకుండా 'ఇంటి దాకా దిగబెడతాం...' అంటూ ఎవరో ఇద్దరు నా వెంటపడ్డారు. వద్దని ఎంత చెప్పినా విన్లేదు. మన గుమ్మందాకా వచ్చి వెళ్ళిపోయారు..." అంది తటిల్లత.

"అయితే ఆడపిల్ల తల్లిదండ్రులు కూతురు టైముకు ఇల్లు చేరుకోకపోయినా హాయిగా గుండెలమీద చెయ్యివేసుకుని నిబ్బరంగా ఉండగలరన్నమాట..."

"అన్న మాట ఏమిటి అన్నయ్యా! అది ఉన్న మాటే..." అన్నాడు త్రినేత్రరావు.

తటిల్లత లోపలకు వెళ్ళి ముఖం కడుక్కుని, కాఫీగ్లాసు తెచ్చుకుని కూర్చుంది. "ఈ రోజు పేపర్లో వార్త చూసేరా?" అంది.

"ఏమిటి?" అన్నాడు త్రినేత్రరావు.

"అదే బాబాయ్! గత కొన్ని సంవత్సరాలుగా వచ్చిన చిత్రాలన్నీ నిషేధించారు, కొన్ని తప్ప..."

"ఏం?"

"ఏముంది. అసభ్యకరమైన పాటలూ, వెధవ కౌగిలింతలూ, మీదపడి పొర్లు కోవడాలూ. రెండర్థాల సంభాషణలు ఉన్న చిత్రాలన్నీ నిషేధించారు. నిషేధించడం అంటే ప్రదర్శన నిలుపు చెయ్యడమే కాదు. ఆ ఫిల్మ్ కాల్చి పడేశారట. చిన్నపిల్లలమీద అవి ఘోరమైన ప్రభావం చూపించడంవల్ల అలా చేశారట."

"అమ్మయ్య ఇప్పుడు కన్నబిడ్డలను కూడా తీసుకుని వెళ్ళి సినిమా చూడ వచ్చన్నమాట" ధీమాగా అన్నాడు పాణిగ్రాహి.

"ఇప్పుడు వస్తున్న సినిమాలు చూడు. సెన్సార్ బోర్డు చాలా ఖచ్చితంగా వున్నందువల్ల ఏ మాత్రం అశ్లీలంలేదు. హీరో 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని మాత్రం అంటున్నాడు హీరోయిన్‌తో ఈ రోజు. ఆ రోజుల్లో హీరోయిన్ ఎముకలు విరిగేలా కౌగిలించుకుని, చీరవిప్పి చెప్పేవాడు. అందుకు హీరోయిన్‌కి సిగ్గులేకపోయినా, చూస్తున్న ఆడ కూతుళ్ళు సిగ్గుపడిపోయేవారు." అన్నాడు త్రినేత్రరావు.

"పోన్లెండి... ఆశించిన మార్పు వచ్చింది. అంతే చాలు..." అంది

తటిల్లత.

"ఇక నేను వస్తానురా..." అంటూ లేచాడు త్రినేత్రరావు.

ఆ తర్వాత అందరూ భోజనం చేశారు.

"హాల్లో ఫాను పాడైంది. తలుపులు మూసుకుంటే గాలి రాదు. ఈ రాత్రి వీధితలుపులు బార్లాతెరచి పడుకుంటాను..." అన్నాడు కిషోర్.

"దొంగల భయం..." నసిగాడు పాణిగ్రాహి.

"భలేవాడివి నాన్నా? ఇపుడు బాబాయ్ చెప్పింది ఏమిటి? దొంగతనాలు అస్సలు జరగటంలేదని కదా!"

ఆ రాత్రి తలుపులు తెరిచి పడుకున్నారు.

ఏ ఘోరమూ జరగకుండానే తెల్లవారింది, తలుపులు తెరిచి పడుకున్నా.

పాణిగ్రాహి లోను తీసుకుని కట్టిస్తున్న ఇంటికి తలుపులు తయారు చెయ్యాలని ఒక కార్పెంటరును పిలిచాడు వాడు ఆ ఉదయం వచ్చేడు.

తలుపులు అవసరంలేదన్న ఆలోచన రాగానే పాణిగ్రాహి వాడిని వెళ్ళిపొమ్మన్నాడు.

"అదేంటి బాబయ్యా?" అన్నాడు వాడు.

"మా ఇంటికి తలుపులు అవసరం లేదురా! వచ్చీపోయేందుకు గుమ్మాలు చాలు..." అన్నాడు పాణిగ్రాహి.

వెర్రిముఖం వేసుకున్నాడు కార్పెంటరు. కిషోర్ కల్పించుకున్నాడు-

"అదికాదు నాన్నా! కనీసం వాన లోపలకు రాకుండా వుండడానికీ, చలిగాలిని భరించగలిగేటందుకూ తలుపులు అవసరం. కేవలం దొంగతనానికోసమే కాదు..." అన్నాడు.

పోయిన ప్రాణం లేచివచ్చినట్లయింది కార్పెంటర్‌కు.

"అవును బాబూ!... అవును..." అన్నాడు కిషోరును సమర్థిస్తూ.

పాణిగ్రాహి ఆలోచించాడు. నిజమే కదా!


"సరే!" అంటూ ఆ కార్పెంటర్‌కు ఆర్డరు ఇచ్చి పంపేశాడు.

ఆ తర్వాత పేపరు చదువుతూ కూర్చున్నాడు కిషోర్.

"నాన్నా! ఇది విన్నావా? X and Y Company విపరీతమైన నష్టాల్లో నడుస్తోందట. వాళ్ళు గోలపెడుతున్నారు. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు..." అన్నాడు కిషోర్.

"అవును, నష్టాలతో నడుస్తున్న కంపెనీలు ప్రభుత్వం చేపడుతుంది..." అన్నాడు పాణిగ్రాహి.

"ప్రభుత్వం ఏమందో తెలుసా? 'మేం తీసుకున్నా నష్టాలే వస్తాయి. మీ ప్రొడక్టు ఇప్పుడు ఎవరికీ అవసరం లేదు. అందుకే మీకు ఈ నష్టాలు. వేరే ప్రొడక్టు ఎన్నుకోండి. ఇంకా అవసర




మైన సాంకేతిక సహాయం, ఆర్థిక సహాయం చేస్తాం' అంది.

"అలాగా! ఇంతకీ ఆ కంపెనీ ఏం తయారుచేస్తుంది?"

"తాళంకప్పలు..."

"అలాగా!"

"అవును. దొంగల భయంలేనందు వల్ల ఎవ్వరూకూడా ఇళ్ళకు తాళాలు వేసుకోవడం లేదు సూట్‌కేసులకు తాళాలు వెయ్యడంలేదు. ఇప్పుడు ఎవ్వరూ అందుకే అవి కొనడం లేదు. అందుకే ఈ నష్టం..." అన్నాడు కిషోర్.

ఇంతలో పాణిగ్రాహి తల్లి అరవై ఏళ్ళ ఆండాళమ్మగారు లోపల్నుంచి వస్తూ-

"రామ రామ... ఏం కాలికాలం వచ్చిందిరా నాయనా? ఇలాంటి కష్టం ఎన్నడూ ఎరగం..." అంది.

"ఏమైంది బామ్మా నీకు? ఏం కష్టం వచ్చింది?" అంది తటిల్లత,

"కష్టంకాకపోతే ఏమిటమ్మా? ధర్మం చేసి పుణ్యం సంపాదించుకుందామంటే ఒక్క ముష్టివాడూ కనిపించడు. ఎవరికి దానం ఇయ్యాలి?" అంది ఆపసోపాలు పడుతూ.

"అసలు ముష్టివాళ్ళు అనేవాళ్ళు నీకు దొరకరు బామ్మా! బిచ్చగాళ్ళను ప్రభుత్వం పూర్తిగా మార్చివేసింది. ఇళ్ళు కట్టించి ఇచ్చి, చేతనైన పని చెయ్యాలని ఆదేశించింది. అందుకు అవకాశం కల్గించింది. ఇప్పుడెవరూ బికారులు లేరు. బిచ్చగాళ్ళూ లేరు.

నీ కొచ్చిన కష్టం అర్థంచేసుకున్నాను కానీ... ఎవ్వరూ ఈ విషయంలో నీకు సహాయం చెయ్యలేరు. సారీ బామ్మా!" అంది తటిల్లత.

కిషోర్ గట్టిగా పేపరు చదవసాగేడు.

"వ్యభిచారం పూర్తిగా ఆగిపోయింది. కూడుకోసం ఒళ్లు అమ్ముకుంటున్న వాళ్ళకు వాళ్ళ అర్హతకు తగ్గ ఉద్యోగం ఇచ్చింది ప్రభుత్వం. 'తిండి దొరికితే మేం ఒళ్ళు ఎందుకు అమ్ముకుంటాము!' అని వాళ్ళు ప్రశ్నిస్తున్నారు......"

మరో వార్త చదివేడు.

"కల్తీ నిరోధకశాఖ వారికి పూర్తిగా పనిలేకుండా పోయింది. గత ఆరు నెల లుగా ఎంత ప్రయత్నించినా ఒక్క కేసు కూడా పట్టుకోలేకపోయారు. దీనికి కారణం వాళ్ళ అసమర్థత కాదు, ఏ వ్యాపారస్తుడూ కల్తీ చెయ్యకుండా వుండడమే అందుకు కారణం. ఆ శాఖ వారు ప్రభుత్వానికి సమర్పించిన మెమో రాండంలో 'పని లేకుండా జీతం తీసు కోవడం అన్యాయం. మాకు వేరే ఏదైనా పని కల్పించండి' అని మొరపెట్టు కున్నారు.

మరో వార్త చదివేడు.

"పని ఎక్కువ అయిందని ఒక ఇల్లాలి మూతివిరుపు..." అనే శీర్షిక క్రిందపడిన వార్త వివరాలు. 'గతంలో పాలవాడు పాలల్లో నీళ్ళు కలిపి పోసే వాడు. ఇప్పుడు అలా కాకుండా పితికినవి పితికినట్లుగా చిక్కగా తెచ్చిపోస్తున్నాడు. కొత్తలో ఆ పాలనుచూసి తెల్ల పెయింట్ అనుకునేవాళ్ళం. తర్వాత అవి చిక్కని పాలు అని తెల్సింది. ఆ చిక్కని పాలు తాగలేక నీళ్ళు కలుపుకోవల్సి వస్తోంది. ఈ నీళ్ళు కలుపుకునే పని ఒకటి ఎక్కు వైంది. ఇదివరకు ఆ పాలవాడే చేస్తూ వచ్చిన పనికూడా నేనే చూసుకోవాలి ఇప్పుడు..."

ఇంకో వార్త చదివేడు.

"అన్యాయం, దగా, కుట్ర, అవినీతి, చీకటిబజారు, నిరుద్యోగం, దారిద్ర్యం, మోసం, లంచం, వ్యభిచారం, దోపిడీ, దొంగతనం, బానిసత్వం, అధికారమదం జులుం- మొదలైన పదాలను భాష లోంచి పూర్తిగా తొలగించాలని ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తోంది. ఈ పదాలను భాష నేర్చుకుంటున్న కుర్రవా ళ్ళకు నేర్పకూడదని అనుకుంటున్నారు. అవేమిటో తెలియచెప్పడం కష్టం అవు తోంది. అవి ఈ రోజున లేనందున ఆ పదానికి అర్థం ఇదీ... అంటూ ఉదా హరణ ఇయ్యటం కుదరని పని అవు తోంది. కనుక ఈ పదాలను భాషలోంచి తొలగించడం అతి త్వరలో జరుగు తుంది..."

ఇంకో వార్త చదివేడు.

"మళ్ళీ ధరలు తగ్గు ముఖంపట్టే సూచన- ప్రభుత్వం తీవ్ర ఆందోళన-

"ఇదే రీతిలో ధరలు తగ్గుముఖం

పడుతూపోతుంటే, వస్తువుయొక్క విలువ పూర్తిగా దిగజారిపోయే ప్రమాదం వుందని ప్రభుత్వం ఆందోళన చెందు తోంది. ధరలు మరీ పడిపోకుండా, కనీస స్థాయిలో వాటిని నిలిపివుంచడంకోసం కొన్ని ఆహార పదార్థాలను సముద్రంలో జారవిడిచే ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తున్నారు. అలా చెయ్యడంతప్ప మరో మార్గంలేదని అర్థికశాస్త్ర విపుణులు అంటున్నారు."

ఇక టైము అవుతోందని అనుకుంటూ వార్తలు వినడం ఆపుచేసి లేచాడు పాణిగ్రాహి. స్నానం చేసి, భోజనం కానిచ్చి ఆఫీసుకు వెళ్ళాడు.

లంచి బ్రేకులో అతని మిత్రుడు కాంతారావు కలిసేడు. మాటల సందర్భంలో-

"మా తమ్ముడి ప్రాక్టీసు పడిపోతోందిరా..." అన్నాడు.

అతని తమ్ముడు ప్రైవేటు డాక్టరు. మంచి హస్తవాసి కలవాడని పేరు పొందాడు అయితే ఇలా ఎందుకయ్యింది?

"అదేమిటి? ఎందుకలా?" ఆశ్చర్యపోయాడు.

"ధర్మాసుపత్రులు నిజంగా తమ ధర్మం పాటించడంవల్ల. రోగులను అతి శ్రద్ధతో వాళ్ళు చూడటంవల్ల, ఒక్క పైసాకూడా అడక్కుండా ఉచితంగా వైద్యం చేస్తూండటంవల్ల ప్రజలంతా ఇప్పుడు ఈ ధర్మాసుపత్రులంటే మోజు చూపుతున్నారు. డాక్టర్లకు, వార్డుబోయ్‌లకూ లంచాలు లేవు. 'ఏ' క్లాసు ట్రీట్‌మెంటు ఉచితంగా దొరుకుతుంటే, డబ్బులు ఖర్చుపెట్టుకుని వైద్యం ఎవరు చేయించుకొంటారు చెప్పు?..."

కాంతారావు మాటలు నిజమే అన్పించింది.

"నేను లేని ఈ ఏడాదిలో దేశంలో వచ్చిన మార్పు చూసి నేను చాలాచాలా గర్విస్తున్నానురా..." అన్నాడు పాణిగ్రాహి.

"ఎందుకురా ఈ సంతోషం? నా తమ్ముడి ప్రాక్టీసు పడిపోయినందుకా?"

"ఛఛ... అదికాదురా... దేశంలో వచ్చిన ఆరోగ్యకరమైన మార్పుల గురించి నా సంతోషం....గత ఏడాదిగా నేను డిప్యుటేషన్ మీద నైజీరియాలో ఉండి రాగానే ఇక్కడవచ్చిన మార్పులు చూసి ప్రతి క్షణమూ ఆశ్చర్యంతో తల మునకలవుతున్నాను... అఫ్‌కోర్స్... మీ తమ్ముడి గురించి చింతిస్తున్నానులే ...కానీ ఏం చెయ్యగలం?..."అన్నాడు పాణిగ్రాహి.

మాట్లాడలేదు కాంతారావు.

"రేపట్నుంచి నీ శలవు మొదలు కదూ!... రైల్లో రిజర్వేషన్ చేయించుకున్నావా? లేకపోతే పిల్లలతో ప్రయాణం కష్టమవుతుంది" పాణిగ్రాహి అన్నాడు.

"ఈరోజు చేయించాను"

"ఇంత ఆలస్యంగానా? రిజర్వేషన్

దొరికిందా?

"ఓహో... నీకు ఈ విషయం తెలియదేమో! ఇప్పుడు వెయిటింగ్ లిస్టు అనేది లేదు రైల్వేలో. ప్రయాణీకులు ఎక్కువగా వుంటే మరో ప్రత్యేక బోగి తగిలించేస్తున్నారు. అంతేకాదు 'నో సీట్' అని ఎవ్వరినీ నిరాశపరచటం లేదు. మొన్న ఒక రైల్వే ఆఫీసరు ఏమన్నాడో తెలుసా?..."

"ఏమన్నాడు?"

'ప్రజా సేవయే మా కర్తవ్యం అన్న నినాదం కేవలం ఆర్టీసీ వాళ్ళదే కాదు, మాదికూడా' అని అన్నాడు.

వెరీగుడ్"

ఆఫీసునుంచి ఇంటికి వస్తుంటే మెయిన్ బజార్లో ఒకతను దీనంగా నిలబడి వున్నాడు. ప్రజలందరూ వచ్చి ఒక్కొక్కడుగా అతని చెంపమీద లెంపకాయ కొడుతున్నారు. కొంచెం ముందుకు వెళ్ళి ఆ వ్యక్తిని చూసి గుర్తించాడు. అతను ఆ ఏరియానుంచి ఎన్నికైన ఎమ్.ఎల్.ఏ.

"ఆగండి! ఎందుకీ దౌర్జన్యం?..." అడిగాడు పాణిగ్రాహి.

"అతను ఎన్నికల ముందు ఒక పార్టీలో వుండి ఎన్నిక అయిపోయి నెగ్గినతర్వాత మరో పార్టీలోకి మారేడు. అతనికి ఆ అధికారం లేదు. అందుకని అతన్ని నలుగురిలో నిలబెట్టి శిక్షిస్తోంది పార్టీ. మనమంతా అతని ఎన్నిక గుర్తు పైన ముద్రకొట్టాం. ఇప్పుడు అతని చెంపమీద కొట్టాలి. ఇది రూలు. ఇలా ఇద్దరు ముగ్గురకు జరిగితే, ఈ పార్టీ ఫిరాయింపులకు నిలుపుదల వస్తుంది." అన్నారు.

"ఆహా! ఎంత ఆదర్శమైన పార్టీ!"

"మీరూ ఇతనికే కనుక ఓటు వేసి వుంటే, మీరుకూడా ఇతన్ని కొట్టవచ్చు" అన్నారు ఎవరో పాణిగ్రాహితో.

బలమంతా ఉపయోగించి సాచి లెంపకాయ కొట్టాడు పాణిగ్రాహి అతడిని.

అతడి బుగ్గలు ఉబ్బివున్నాయి. పాపం, ఎన్నిసార్లు లెంపకాయలు తిన్నాడో! కళ్ళలో నీళ్ళు. కళ్ళు ఎర్రగా అయ్యాయి.

"క్షమించండి, బుద్ధివచ్చింది. మీరు నన్ను ఏ పార్టీమీద ఎన్నుకున్నారో అందులోనే వుంటాను: సిద్ధాంతాలకు కట్టుబడతాను. పదవికోసం రంగులు మార్చను" అన్నాడు అతను చేతులు జోడించి.

"సరే, పో" అన్నారు వాళ్ళు.

'బ్రతుకుజీవుడా' అని వెళ్ళిపోయాడు అతను.

ఇంటికొచ్చి కాఫీ తాగి మళ్ళీ పేపరు పట్టుకున్నాడు.

"ఒలెంపిక్స్‌లో ఇండియా అత్యధిక సంఖ్యలో గోల్డుమెడల్స్ గెల్చుకుని ఫస్ట్ వచ్చింది".

"మనదేశం గతంలో ఇతర దేశాల




మంచి తెచ్చిన అప్పులన్నీ తీర్చి వేసింది!"

"అభివృద్ధిచెందిన మనదేశం ఇతర అభివృద్ధిచెందుతున్న దేశాలకు సహాయం చెయ్యడానికి నిర్ణయించిన వైనం..."

ఆ రాత్రి భోజనంచేసి నిద్రించాడు.

*   *   *

'వర్షం పడుతున్నట్లుందే!' అనుకున్నాడు పాణిగ్రాహి. ముఖంమీద చినుకులు పడగానే శాంభవి కంఠం గట్టిగా వినిపించింది.

'లేవండి, ఏమిటా మొద్దునిద్ర. పట్టపగలు పైగా కలవరింతలొకటి.'

కళ్ళు తెరిచాడు. తను మంచంమీద వున్నాడు. శాంభవి తన ముఖంమీద నీళ్ళు చల్లింది. తను వర్షం చినుకులనుకున్నది ఆ నీళ్ళే.

"నిద్రపోతుంటే ఇలాగా లేపడం!" కొంచెం చిరాగ్గా అన్నాడు.

"ఏం చెయ్యను! ఎన్నిసార్లు లేపినా లేవరు. ఏదో పగటికలలు కంటున్నారు కాబోలు" అంది.

అవును, కలగన్నాడు. అదికూడా పగటికల!

కలవురోజు కదా అని ఈ ఆదివారం రోజున మధ్యాహ్నం భోజనంచేసి మంచం ఎక్కాడు. భోజనానికి ముందు బజారుకి వెళ్ళినప్పుడు ఎలక్షన్లు కదా అని

ఎవరో పార్టీ తరపున వాగ్దానాలు చేస్తున్నారు బహిరంగ సభలో. ఆ వాగ్దానాలు తల్చుకుంటూ పడుకుంటే, ఈ కల వచ్చిందన్నమాట. ఆ వాగ్దానాలు గుర్తుచేసుకున్నాడు.

"మేం అధికారంలోకి వస్తే-
నిరుద్యోగం రూపుమాపుతాం,
కరువును దూరంచేస్తాం,
ధరలు తగ్గిస్తాం,
అన్యాయాలూ, అక్రమాలూ
అరికడతాం,
అవినీతిని పారద్రోలుతాం,
అనేక సౌకర్యాలు కల్పిస్తాం,
కల్తీ అంటే తెలియకుండా చేస్తాం.
లంచగొండితనం అంతంచేస్తాం
రౌడీలను, గూండాలను కొరత
వేస్తాం.

ఇవన్నీ జరిగేవేనా? సన్నగా నవ్వుకున్నాడు.

"ఎందుకా నవ్వు? లేవండిక" అంది శాంభవి.

అయితే తను ఒక సంవత్సరంపాటు విదేశాల్లో ఉన్న విషయంకూడా అబద్ధమేనన్నమాట! లేచి చన్నీళ్ళతో ముఖం కడుక్కున్నాడు

భార్య ఇచ్చిన టీ అందుకున్నాడు.

"మీరు మార్కెట్‌కు వెళ్ళాలి. కిరోసిన్ క్యూలో నిలబడి కిరోసిన్ తేవాలి. చక్కెర లేదు. బ్లాక్‌లో అది కూడా కొనాలి" అంది.

"ధరలు మండిపోతున్నాయి, అయినా తప్పదు!" నిట్టూర్చాడు.

"కాలేజీలో తటిల్లతకు ఏదో ఫంక్షనుందని వెళ్ళింది, మీరుకూడా వెళ్ళండి. వచ్చేసరికి ఆలస్యమవుతుంది. తోడు ఉండరుగాని" అంది శాంభవి.

కోపం వచ్చింది పాణిగ్రాహికి.

"అన్నింటికీ నేనే చావాలా? ఆ కిషోర్‌గాడు ఏడీ? చదువు పూర్తయి రెండుసంవత్సరాలైనా ఉద్యోగం, సద్యోగం లేక బడుద్దాయిలా రోడ్లు కొలుస్తున్నాడుగా. వాడ్ని వెళ్ళమను. ఇంట్లో కూర్చుని ఏంచేస్తాడు?" అక్కసు చూపించేడు.

కిషోర్ ఆ మాటలు విని బాధపడుతూ కూర్చున్నాడు.

"అను నాన్నా! నీ గుండెమంట నేను అర్థం చేసుకోగలను. చేతికి అందివస్తానని గంపెడాశతో కడుపు కట్టుకుని చదివించావు. ఉద్యోగం దొరకనందువల్ల బాధతో అలా అంటున్నావు. నీ కోపం నామీద కాదనీ, ఈ వ్యవస్థమీద అనీ నాకు తెలుసులే, మధ్యతరగతి బేషజం వదులుకోలేక ఇలా వున్నాను.

"ఇంకొక్క నెల చూస్తాను. లేకపోతే ఇటుకలు మోస్తాను నాన్నా! ఇటుకలు మోస్తున్న డిగ్రీ హోల్డర్ అనిపించుకుంటాను" అనుకున్నాడు కిషోర్.

"బాగుంది... ఖాళీగా కూర్చున్నాడంటే అది వాడి తప్పా? ఆ లంచం

ఇచ్చి ఉద్యోగం వేయించే ఛాన్సు వచ్చినప్పుడు మొండిగా కుదరదని ఊరుకుంటిరి. లేకపోతే ఈ రోజు వాడో ఉద్యోగంలో ఉండేవాడు..." అంది శాంభవి.

"అది నాకు నచ్చని పనేకాక చేతకాని పనికూడానూ. ఏనాడూ లంచం తిని ఎరుగని నేను మరొకడికి లంచాలు ఇచ్చుకునే స్థితిలో లేను; అందుకే చేతకాని చవట వెధవలాగ కూర్చుండిపోయాను మరి..." రోషంగా అని, 'క్యూ'లో నిలబడేందుకు వెళ్ళిపోయాడు. అలా పోతూవుంటే మోటర్ సైకిల్ మీద వెళ్తున్న త్రినేత్రరావు కనిపించాడు.

అన్నగారిని చూసి ఆగేడు.

"ఏమిటి హడావుడిలో వున్నట్లున్నావు?..." అడిగేడు పాణిగ్రాహి.

"మా బ్రతుకుల్లో తీరిక ఎక్కడిది? ఏదో ఒక హడావుడి. హత్య, దోపిడీ, దొంగతనం, మోసం, వ్యభిచారం, కల్తీనేరాలు- ఇవేమీ కాకపోతే ఆత్మహత్య- ఇలాగే ఏదో ఒకటి- ఊపిరి పీల్చుకుందుకు కూడా తీరికలేనంతగా ఘోరాలు జరిగిపోతున్నాయి. అలాంటిదే ఒక పనిమీద వెళుతున్నాను. నువ్వు ఎక్కడికి?" అన్నాడు త్రినేత్రరావు.

చేతిలో ఉన్న కిరోసిన్ డబ్బా చూపిస్తూ- "క్యూలో నిలబడేందుకు..." అన్నాడు నీరసంగా-

"వస్తాను..." అంటూ మోటర్ సైకిల్ స్టార్ట్ చేసిన త్రినేత్రరావు పోలీసుస్టేషన్‌కి-

క్యూలో నిలబడేందుకు పాణిగ్రాహి రేషన్‌షాపుకి-

చెల్లెలకు తోడుగా వుండాలని బయలుదేరిన కిషోర్ కాలేజీకి-

శాంభవి ఆటు పాలకోసం క్యూ దగ్గరకి-

ఫంక్షన్లో కుర్రకారు గోలకీ, వాడి చూపులకీ తట్టుకోలేని తటిల్లత ప్రిన్సిపాల్ సీటు వైపుకి-

